
సాక్షి
చిత్తూరు
శనివారం । 18 । జనవరి । 2025



భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో సంకటహర చతుర్థి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. - IIలో



ఏనుగు ముప్పు.. ఎవరు దిక్కు

చిత్తూరు జిల్లాలోని అటవీ సమీప గ్రామాల్లో పంటలపై ఏనుగుల వరుస దాడులతో రైతులు నష్టపోతున్నారు. - IIలో



రుణ పంపిణీకి సహకరించండి

వందశాతం రుణాల పంపిణీకి బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. - IIలో

వైద్యం.. ధనార్జనే ధ్యేయం



మెడి'కిల్' మాఫియా!

- కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల కాసుల కక్కుర్తి
- ఫీజుల పేరుతో బాదుడు
- వైద్యం.. సామాన్యుడు మోయలేని భారం
- పట్టించుకోని అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. కాసుల కోసం సైలెంట్‌గా ప్రజల ప్రాణాలను హరిస్తోంది. కొంత మంది ఆర్‌ఎంపీలు నుంచి కొన్ని కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల వరకు ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్నాయి. ఇష్టానుసారంగా వైద్యం చేస్తూ ఫీజుల పేరుతో బాదేస్తోంది. ధనార్జనే ధ్యేయంగా చికిత్స చేస్తోంది. అమాయక ప్రజల నుంచి అందిన కాడికి దోచుకుంటోంది. ఈ దందా జిల్లా వ్యాప్తంగా మరింత పుంజుకుంటోంది. అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1500 మందికి పైగా ఆర్‌ఎంపీలు, 2 వేల వరకు ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. వీటికి ప్రతిరోజూ వేలల్లో జనం వస్తున్నారు.

సేవాదృక్పథం మాయం

ఒప్పుడు డాక్టరంటే దేవుడు లెక్క. ఆ కోవకు చెందిన కొందరు ఇప్పటికీ రూ.10 ఫీజుతో ప్రజలకు ప్రైవేటు వైద్య సేవలు అందిస్తున్నారు. నిరుపేదలైతే ఆ రూ.10 కూడా వద్దన్ని చికిత్సతోపాటు ఉచితంగా మందులు, మాత్రలు ఇచ్చి సేవాదృక్పథాన్ని చాటుకుంటుంటారు. కానీ ఇటీవల కాలంలో చాలా మంది మెడికల్ వ్యవస్థను పెద్ద వ్యాపారంగా మార్చేశారు. దీంతో సేవా దృక్పథం మాయం అయ్యింది. నేడు మెడికల్ మాఫియా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది.

చుట్టు ముడుతున్న వ్యాధులు

వాతావరణ పరిస్థితులు, తీసుకునే ఆహారం, చెడు అలవాట్లు తదితర కారణాలతో మనిషి ఆయుష్షు తరిగిపోతోంది. పలు రకాల వ్యాధులు సైతం చుట్టిముట్టేస్తున్నాయి. ప్రధానంగా గుండె జబ్బులు, మధుమేహం, బీపీ, క్యాన్సర్ వంటి సమస్యలు వేల సంఖ్యలో నమోదవుతున్నాయి. డెంగీ, విషజ్వరాలు, చైనా వైరస్ తదితర వ్యాధులు ప్రజలను భయపెట్టిస్తున్నాయి. మెడికల్ మాఫియా.. వైరస్ కంటే వేగంగా సోషల్ మాధ్యమాలను వేదిక చేసుకుని విష ప్రచారం చేయిస్తోంది. ఈ ప్రచారం అమాయక ప్రజల్లో వణుకు పుట్టిస్తోంది. ఇదంతా కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు వరంలా మారుతోంది.

పల్లె వైద్యానికి శ్రీకారం చుట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

అనధికార వైద్యం, డమ్మీ డాక్టర్లు, మెడికల్ మాఫియాకు చెక్ పెట్టాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించి, పల్లె వైద్యానికి శ్రీకారం చుట్టింది. సచివాలయ పరిధిలో వైఎస్సార్‌ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించింది. మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ల ద్వారా అక్కడే వైద్యసేవలు అందిస్తూ వచ్చింది. ప్రధానంగా బీపీ, మధుమేహ వ్యాధులను కంట్రోల్ చేయడానికి ప్రయత్నించింది. జగనన్న సురక్ష కార్యక్రమంతో ఇంటింటా వైద్య పరీక్షలు చేసి, పల్లె ప్రజల ఆరోగ్యానికి అండగా నిలబడింది. ఫ్యామిలీ ఫిజిషియన్‌తో డాక్టర్లు ఊర్లోకి వచ్చేలా చేసింది. ఇంటికే అవసరమైన మందులు, మాత్రలను అందించేలా చర్యలు చేపట్టింది.



పెనుమూరు క్రాస్‌లో ఆర్‌ఎంపీ క్లినిక్ పై చేసిన దాడుల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న పలు రకాల ఇంజెక్షన్లు, మందులు, మాత్రలు(ఫైల్)

చిత్తూరు నగరం పెనుమూరు క్రాస్‌లో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు ఇష్టారాజ్యంగా వైద్యం చేస్తున్నాడు. దీనిపై ఫిర్యాదు అందడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పలు రకాల మందులు, మాత్రలు, ఇంజెక్షన్లు పట్టుబడ్డాయి. పురిటి బిడ్డలకు కూడా వైద్యం చేస్తున్నారని తెలిసి మండిపాటుకు గురయ్యారు. పట్టుబడిన మందులను సీజ్ చేసి, నోటీసులు ఇచ్చారు. ఇది రెండు నెలలకు క్రితం జరిగింది.



ఆర్‌ఎంపీ వద్దకు చంటి బిడ్డను తీసుకొచ్చిన తండ్రి (ఫైల్)

యాదమరి మండల కేంద్రంలోని ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌ను అక్కడి మండల వైద్యాధికారి సురేఖ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్‌ఎంపీ చిన్నపిల్లలు, గర్భిణులకు వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. సెలైన్ బాటిల్ పెట్టడాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇష్టానుసారంగా ఇంజెక్షన్లు, మందులు, మాత్రలు ఇస్తున్నట్లు తెలిసింది. దీంతో హెచ్చరికలు జారీ చేసి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులకు రిపోర్ట్ చేశారు. ఈ ఘటనపై కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇదంతా ఐదు రోజులకు కిందట జరిగింది.

వైద్యోనారాయణో హరి అన్నారు పెద్దలు.. వైద్యుడిని దేవుడితో పోల్చారు.. ఆ సృష్టికర్త జీవుడిని పుట్టిస్తే.. ఆ జీవి అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ప్రాణం పోసి, మృత్యుంజయుడిగా మారుస్తాడు. కాలానుగుణంగా వైద్యంలో మార్పులు వచ్చాయి. కొందరు కేవలం డబ్బుల కోసం నాడి పట్టుకుంటున్నారు. అందినకాడికి దోచేస్తున్నారు. పల్లెలు, పట్టణాలు.. ఆర్‌ఎంపీలు, పెద్ద డాక్టర్లు అన్న తేడా లేకుండా ధనార్జనే ధ్యేయంగా వైద్యం చేస్తున్నారు. మెడికల్ వ్యవస్థ ఓ మాఫియాగా మారిపోయింది.

దోపిడీ ఇలా..

ఏదైనా కొత్తగా వైరస్, రోగాలు వస్తే.. మాఫియాకు పండుగే. ఇదే సమాజంలో ముందుండి వ్యాపారం కోసం పావులు కదుపుతోంది. ప్రజలను భయపెట్టేలా వ్యాధి లక్షణాలు, నిర్లక్ష్యం చేస్తే ప్రాణం పోతోందని ప్రచారం మొదలెట్టి ఆస్పత్రులకు రప్పించుకుంటోంది. ఆస్పత్రికి వచ్చిన తరువాత ఫీజు రూ.200 నుంచి రూ.500 వరకు దోపిడీ మొదలు పెట్టి రక్త పరీక్షలకు రూ.600 నుంచి రూ.8 వేల వరకు, స్కానింగ్‌లు రూ. 500 నుంచి రూ.10 వేల వరకు దోపిడీ చేస్తోంది. డెంగీ పరీక్ష (ప్లేట్‌లెట్ కౌంట్)కు రూ.2 వేలకు పైగా పలు ల్యాబ్‌లు వసూలు చేస్తున్నాయి. వైద్యులు రోగులకు మందులు, మాత్రలు రూ.వెయ్యి మొదలుకుని రూ.5 వేల వరకు రాయిస్తుంటారు. ఆ మాత్రలు కూడా ఆయా ఆస్పత్రుల్లో తప్ప, మరో చోట దొరకవు. సిజేరియన్‌కు రూ.50 వేలు, చిన్న ఆపరేషన్‌కు రూ.10 వేలు, పెద్ద ఆపరేషన్‌కు రూ. 2 లక్షలకు పైగా ఫీజులు నిర్ణయించి, దోచుకుంటున్నారు. కరోనా సమయంలో 14 రోజులకు రూ. 2 లక్షల వరకు ఫీజులు వసూళ్లు చేసిన కేసులు చాలానే ఉన్నాయి. ఇంతస్థాయిలో ఖర్చులు భరించలేని సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.



ఆర్‌ఎంపీ వైద్యం.. మనిషికి అనారోగ్యం

చాలా మంది ఆర్‌ఎంపీ వైద్యులు ఇష్టానుసారంగా వైద్య సేవలు చేస్తున్నారు. అసలు సర్టిఫికెట్లే లేకుండా వైద్యం చేయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీరి వైద్యం విచ్చలవిడిగా మారింది. ఇంజెక్షన్లు ఇవ్వడంతోపాటు చిన్నపిల్లలకు కూడా వైద్యం చేయిస్తున్నారు. ఓవర్ డోస్ ఇచ్చేస్తూ..ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్నారు. ఈ డమ్మీ డాక్టర్లపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.





యాదమరిలోని ఆర్‌ఎంపీ క్లినిక్ తనిఖీ (ఫైల్)

మచ్చ తేవద్దు.. మనుషులను కాపాడండి



మానవ జన్మ దేవుడిచ్చిన వరంలాంటిది. ఈజన్మంతా పాపపుణ్యాలపై ఆధారపడి ఉంటుంది. ప్రజలు అనే భక్తులకు..డాక్టర్లు దేవుడు లెక్క కనిపిస్తారు. కొంత మంది ఈ వ్యవస్థకు మచ్చ తెచ్చిపెడుతున్నారు. డబ్బు అనే వ్యామోహంలో పడి వైద్యాన్ని వ్యాపారంలా మార్చేశారు. అధికారులు కూడా దృష్టి సారించాలి. అనుమతి లేని ఆస్పత్రులపై కొరఢా ఝుళిపించాలి. మనకేమని వదలేయడం కరెక్టు కాదు.

–రాజరత్నంరెడ్డి, ప్రజాహిత సేవా సంస్థ అధ్యక్షుడు, చిత్తూరు

కచ్చితంగా చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ నిబంధన మేరకు ఆస్పత్రుల నిర్వహణ జరగాలి. అనుమతి లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా చేస్తే జిల్లా పాలన అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాధుల పేరుతో భయపెట్టి వైద్యం చేస్తున్నారని నిర్ధారణ అయితే కఠినంగా వ్యవహరిస్తాం.

–సుధారాణి, డీఎంఅండ్‌హెచ్, చిత్తూరు

అశ్రుదారి

- చెన్నై–బెంగళూరు హైవేపై మరణ మృదంగం
- బస్సును ఢీ కొన్న టిప్పర్
- మృతుల్లో ఇద్దరు తిరుపతి.. మరో ఇద్దరు తమిళనాడు వాసులు
- చిత్తూరులో జరిగిన బస్సు ప్రమాదంలో 22 మందికి గాయాలు
- తెల్లవారు జాము వరకు పరిస్థితి పర్యవేక్షించిన కలెక్టర్



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

శ్రీవారి ఆలయం వద్ద జీవ చివరి ఫొటో

ప్రశాంత్ (ఫైల్)

చిత్తూరు అర్బన్/చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగర శివారుల్లోని గాజులపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణంగా నిర్ధారణ అయ్యింది. రోడ్డు పనులు చేస్తున్న ప్రైవేటు కంపెనీ నిర్వాహకుల తప్పిదం వల్లే నలుగురు మృత్యువాత పడ్డారు. సర్వీసు రోడ్డు నుంచి గ్రావెల్ మట్టి తరలిస్తున్న టిప్పర్, యూ టర్న్ తీసుకుని అవతలి వైపునకు వెళ్లాల్సి ఉంది. కానీ టిప్పర్ డ్రైవర్ రాత్రి వేళల్లో రోడ్డుకు అడ్డుగా ఉంచిన దిమ్మెలు తొలగించి, రాంగ్ రూట్‌లో తిరుగుతుంటాడు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి టిప్పర్ రాంగ్ రూట్‌లో జాతీయ రహదారిపైకి వచ్చి, బస్సును ఢీ కొట్టింది. దీంతో అదుపు తప్పిన బస్సు, అక్కడే ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని రాసుకుంటూ 20 మీటర్ల దూరంలో ఎగిరి బోల్తా పడింది. ఈ ఘటనలో క్షతగాత్రులను అధికారులు వేలూరులోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి, చికిత్స అందిస్తున్నారు.



ఈ దిమ్మెలను తొలగించే.. టిప్పర్ రాంగ్ రూట్‌పైకి వచ్చింది

ఆదమరచి నిద్రిస్తున్న వేళ..

తిరుపతి–మధురై మధ్య రోజూ తమిళనాడుకు చెందిన ఓ ట్రావెల్స్ స్లీపర్ క్లాస్ బస్సు నడుస్తోంది. రాత్రి 9.45 గంటలకు తిరుపతిలో బయలుదేరిన బస్సు శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మధురై చేరుకోవాల్సి ఉంది. రాత్రి 11.30 గంటల మధ్య చిత్తూరు నగరాన్ని దాటుకున్న బస్సు.. వేలూరు రోడ్డులోని గాజులపల్లె వైపు వెళుతోంది. మొత్తం 26 మంది ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండగా, దాదాపు వంద కిలోమీటర్ల వేగంతో బస్సు వెళుతోంది. అదే సమయంలో యాదమరి వైపు నుంచి గ్రావెల్ మట్టి తరలిస్తున్న ఓ టిప్పర్ బస్సును మధ్య భాగంలో ఢీ కొట్టింది. బస్సు వేగానికి టిప్పర్ ఢీ కొట్టడంతో.. డ్రైవర్‌కు ఎడమ వైపున బస్సు పడిపోయింది. దీంతో ఒక్కసారిగా హాహాకారాలు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. ఘటన జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పది నిముషాల్లో ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకున్న పోలీసులు, వెంటనే అంబులెన్స్‌ను పిలిపించారు. ప్రమాదం జరిగిన అర్ధగంట తరువాత భారీ క్రేన్ సాయంతో బస్సును పైకిలేపి నిలబెట్టారు. బస్సులో గాయపడిన వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



అర్ధరాత్రి పోలీసులతో కలసి సంఘటనా స్థలంలో చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

గమ్యం చేరకనే తిరిగిరాని లోకాలకు..

కాగా ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, 22 మంది గాయపడ్డారు. మృతుల్లో తిరుపతి సప్తగిరి నగర్‌కు చెందిన ముత్తు విజయ్‌రాజు కుమారుడు ఎం.పాన్‌చంద్రు (33), ఎన్‌జీఓ కాలనీకి చెందిన శ్రీకాంత్ కుమారుడు కె.శ్రీధర్ (21), తమిళనాడులోని కుంభకోణం నగరానికి చెందిన ఏజీ.ప్రశాంత్ (43), కన్యాకుమారికి చెందిన జీవ (40) ఉన్నారు. వీరిలో తిరుపతికి చెందిన పాన్‌చంద్రు టైర్ల దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. తన తల్లి అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమెకు మధురైలోని ఆస్పత్రిలో చికిత్స చేయించడానికి బస్సులో బయలుదేరాడు. "రాత్రి నిద్రలో ఉండగా పెద్ద శబ్దం వచ్చింది. లేచి చూసేసరికి అంతా చీకటి.. అరుపులు.. కళ్లు తిరిగి పడిపోయాను. ఉదయం నా కొడుకు చనిపోయినాడు అని చెప్పారు. మేమేమీ పాపం చేశాం.." అంటూ పాన్‌చంద్రు తల్లి సెల్వ సుందరి కన్నీటి పర్వతమయ్యారు. శ్రీధర్ తంజావూరులోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల శస్త్రలో బి.టెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతని తండ్రి శ్రీకాంత్.. తిరుపతిలోని ఆదాయపన్నుశాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. దశరా సెలవులకు వచ్చిన శ్రీధర్, సెలవులు పూర్తవడంతో తిరిగి కళాశాలకు వెళుతూ మృత్యువాత పడ్డాడు. ఇక తమిళనాడుకు చెందిన జీవ, ప్రశాంత్ ఇద్దరూ పదేళ్లుగా స్నేహితులు. ఇద్దరీ స్వస్థలాలు వేర్వేరైనప్పటికీ.. చెన్నైలో ఏర్పడిన స్నేహంతో తరచూ కలుస్తుండేవాళ్లు. గురువారం కాలినడకన తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుని.. ఇంటికి బయలుదేరుతున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారు. ఇంతలో ప్రమాదం జరిగిన మృత్యువాత పడ్డారు. ఇద్దరికీ పెళ్లి అయ్యి పిల్లలున్నారు. కాగా మృతదేహాలన్నింటికి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం తెల్లవారుజాము 3 గంటల వరకు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఉంటూ, వైద్య సేవల్ని పర్యవేక్షించారు. చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్ రాజు, డీఎస్పీ సాయినాథ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తాలూక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

చౌడేపల్లెలో నకిలీ కరెన్సీ



చౌడేపల్లె: మండలంలో వంద, రెండు వందల రూపాయల నకిలీ కరెన్సీ నోట్లు దర్శనమిస్తున్నాయి. తాజాగా శుక్రవారం స్థానిక బస్టాండ్ సమీపంలోని ఓ దుకాణ యజమాని నకిలీ కరెన్సీ నోటును గుర్తించాడు. ఏ మాత్రం తేడా లేకుండా ముద్రించిన నకిలీ రూ.200 నోటును గమనించి, ఇరుగుపొరుగు వారికి చూపించారు. నకిలీ కరెన్సీ నోట్లు మండలంలో జోరుగా చేతులు మారుతున్నాయి. గత నెల రోజులుగా నకిలీనోట్లు బెడద తీవ్రంగా ఉందన్నారు. షాపుల నిర్వాహకులే కాకుండా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

సమగ్రశిక్ష అభివృద్ధికి కృషి

- బాధ్యతలు స్వీకరించిన సమగ్రశిక్ష నూతన ఏపీసీ వెంకటరమణ



నూతన ఏపీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పూర్వపు ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరుకలెక్టరేట్ : క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది అందరి సమన్వయంతో సమగ్రశిక్ష శాఖ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని ఆ శాఖలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమగ్రశిక్ష శాఖ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడతానన్నారు. తాను గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్కూల్ అసిస్టెంట్, హెచ్‌ఎంగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. సమగ్రశిక్ష శాఖ ఆధ్వర్యంలో అమలయ్యే ప్రతి పథకం పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపడతానన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి నేరుగా తీసుకురావాలన్నారు. సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లు కచ్చితంగా తమ విధులు నిర్వహించాలన్నారు. పూర్వపు ఏపీసీ వెంకటరమణారెడ్డి నూతన ఏపీసీకి బాధ్యతలు అప్పజెప్పి, రిలీవ్ అయ్యారు. అనంతరం ఆయన్ని సెక్టోరల్ అధికారులు, ఎంఈఓలు, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సెక్టోరల్ అధికారులు జయప్రకాష్, నరోత్తమరెడ్డి, ఉదయలక్ష్మి, జయప్రకాష్ నాయుడు, సిబ్బంది కుమార్, గుణ, చైతన్య పాల్గొన్నారు.

యోగివేమన జయంతి రేపు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 19వ తేదీన యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యోగి వేమన జయంతిని రాష్ట్ర స్థాయి వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ ఉత్తర్వుల మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు హాజరుకావాలని డీడీ కోరారు.

20న ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఉన్న డీఆర్‌డీఏ ట్రెనింగ్ సెంటర్, పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధికల్పనాశాఖ, సీడప్, డీఆర్‌డీఏలు సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో అర్హత ఉన్న యువతీ, యువకులు ఈ ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మేళాలో 6 కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివి పాస్, ఫెయిల్ అయిన యువత పాల్గొనవచ్చని చెప్పారు. వయస్సు 18–30 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. ఇతర వివరాలకు 91609 40471, 99635 61755, 63009 54441 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పకడ్బందీగా కుష్టు సర్వే

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో ఈనెల 20వ తేదీ నుంచి జరిగే కుష్టు సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ వైద్య సిబ్బందిని ఆదేశించామని తెలిపారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని జిల్లా క్షయ నివారణ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్టు వ్యాధి సర్వే జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలోని వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఈ సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. కుష్టులక్షణాలను గుర్తించాలన్నారు. అనుమానిత కేసులుంటే వెంటనే వైద్యాధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. సర్వేకు వెళ్లే సమయంలో వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, వాటితో కలిగే శారీరక సమస్యపై అవగాహన కల్పించాలన్ని సిబ్బందికి ఆదేశించామన్నారు.

ఆచరణతోనే భద్రత



మాట్లాడుతున్న డీటీసీ నిరంజన్‌రెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రోడ్డుపై నడిచినా, వాహనం నడిపినా నిబంధనలు పాటించినప్పుడే భద్రంగా గమ్యాన్ని చేరకుంటామని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని డీటీసీ కార్యాలయంలో శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలపై వాహనచోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు కచ్చితంగా రోడ్డు నిబంధనలను పాటించాలన్నారు. ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్ ధరించడంతోపాటు కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు విధిగా పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి బండి ఎక్కడం కరెక్టు కాదన్నారు. లైసెన్స్ లేకుండా బండి నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ఓవర్ స్పీడ్ ఉండకూడదన్నారు. యువత స్పీడు తగ్గిస్తే గమ్యం సురక్షితంగా ఉంటుందన్నారు. బండి నడిపే సమయంలో కుటుంబాన్ని దృష్టి పెట్టుకోవాలన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రాణం విలువను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సునీల్‌కుమార్, ఎంవీఐలు మురళి, నరసింహులు, దీపిక తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ ఒక రోజు పొడిగింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో రేషన్ పంపిణీని ఒకరోజు పాటు పొడిగించినట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఈనేపథ్యంలో శనివారం రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 90 శాతం పంపిణీ జరిగిందన్నారు. మిగిలిన కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సాయంత్రంకల్లా రేషన్ తీసుకోవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

21న కలెక్టరేట్‌లో ఎస్సీ వర్గీకరణపై సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ వర్గీకరణ సమావేశం ఈ నెల 21వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత అత్యున్నత న్యాయస్థానం, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. షెడ్యూల్ కులాలలోని ఉప వర్గీకరణపై విచారణ చేసేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా విచ్చేస్తున్నారన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 11 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై వినతులు స్వీకరిస్తారన్నారు. స్వీకరించే వినతులను పరిశీలన చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తారన్నారు. వివిధ ప్రభుత్వశాఖల్లో, విద్యాసంస్థల్లో షెడ్యూల్డ్ కులాల ఉపవర్గాలు, షెడ్యూల్డ్ కులాలలోని వివిధ ఉప వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా పరంగా ఉన్న వెనుకబాటు అంశాలపై కమిటీ పరిశీలిస్తుందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్సీ కుల సంఘాల నాయకులు, వ్యక్తులు సంస్థలు హాజరై వినతులు అందజేయాలని కలెక్టర్ కోరారు.

22న చలో విజయవాడ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీపీసీ (డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్, అసోసియేట్ అధ్యక్షుడు నాగసురేష్ తెలిపారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 1998లో ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లకు ఉద్యోగోన్నతి కల్పించి జూనియర్ లెక్చరర్లుగా నియమించినట్టు తెలిపారు. వారు జీవో నంబర్ 302 ప్రకారం ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన ప్రిన్సిపాల్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులుగా ఉద్యోగోన్నతి పొందారని చెప్పారు. మార్చి 16న డీపీసీ అధ్యాపకులను పక్కనపెట్టి సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా అనర్హులకు ఉద్యోగోన్నతి కల్పించినట్టు ఆరోపించారు. జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, అక్రమ ఉద్యోగోన్నతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 22న విజయవాడలో సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నామన్నారు. చలో విజయవాడకు జూనియర్ లెక్చరర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పక్కాగా ఈ-క్రాప్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రబీలో సాగైన ప్రతి పంటను ఈ-క్రాప్‌లో పక్కాగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన శుక్రవారం వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు సంవృద్ధిగా కురవడంతో పంట సాగు విస్తీర్ణం పెరగాలన్నారు. సాగులోకి వచ్చిన ప్రతి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. రైతుల ద్వారా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయించాలన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతలో రాజీ లేదని స్పష్టం చేశారు. అనంతరం ఏపీ వ్యవసాయాధికారుల నూతన సంవత్సరం-2025 డైరీని ఆవిష్కరించారు. సమావేశంలో ఏడీలు, ఏఓలు పాల్గొన్నారు.

■ పంటలపై వరుస దాడులు ■ ఆందోళనలో అన్నదాతలు
■ నష్టం అపారం.. పరిహారం నామమాత్రం
■ ఏనుగుల తరలింపు ప్రయత్నాలు విఫలం

ఏనుగు ముప్పు.. ఎవరు దిక్కు?



గజరాజులకు అడవుల్లో మేత కరువైంది. మనుగడ కష్టమై పంట పొలాలపై దాడులు చేస్తున్నాయి. పంటల రక్షణకు కర్షకులు శత విధాల ప్రయత్నిస్తున్నారు. ఈ సంఘర్షణను ప్రభుత్వం, అధికారులు చేష్టలుడిగి చూస్తుండడం విషాదంగా మిగులుతోంది. పంటలను కాపాడేందుకు నిర్మించిన విద్యుత్ కంచె, కందకాలు ఫలితం ఇవ్వకపోగా, అధికారులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఏనుగు ముప్పు.. మా కెవరు దిక్కు అని అన్నదాత ఆవేదన చెందుతున్నాడు.



రెండు రోజుల క్రితం బోడబండ్లలో ఏనుగులు విరిచేసిన అరటి చెట్లు

బంగారుపాళెం: జిల్లాలోని పలు గ్రామాల్లో పంటలపై గజరాజుల వరుస దాడులతో రైతులు బెంబెలెత్తుతున్నారు. రోజూ ఏదో ఒక ప్రాంతంలో ఏనుగుల దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఏనుగుల దాడులతో పంటల ధ్వంసం అవుతున్నాయి. దీంతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోంది. గజరాజుల దాడులను అరికట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలు విఫలం అవుతున్నాయి. ఏనుగుల దాడుల నుంచి తమ పంటలను కాపాడాలని రైతులు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు.

పంటలపై వరుస దాడులు

మండలంలోని టేకుమంద, రాగిమానుపెంట, కీరమంద, వేపనపల్లె, వెలుతురుచేను, సామచేను మిట్ట, బండ్లదొడ్డి, బోడబండ్ల తదితర గ్రామాల్లో రైతుల సాగు చేసిన పంటలపై ఏనుగులు వరుస దాడులు చేస్తున్నాయి. మామిడి, కొబ్బరి, అరటి, వరి, చెరుకు, టమాట తదితర పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి పంటలు సాగు చేసుకుంటున్నామని, ఏనుగులు దాడులతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏనుగులకు అనువైన ప్రదేశం

చిత్తూరు జిల్లాలోని కుప్పం, రామకుప్పం, శాంతిపురం, వి.కోట, పలమనేరు, బంగారుపాళెం, యాదమరి మండలాల్లో కౌండిన్య అభయారణ్యం విస్తరించి ఉంది. ఈ కౌండిన్య అటవీ ప్రాంతం తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు ఆనుకుని ఉంది. ప్రధానంగా తమిళనాడు సరిహద్దు నుంచి మన రాష్ట్ర సరిహద్దు వరకు 150 కిలో మీటర్ల వరకు ఏనుగులు సంచరించడానికి అనువైన ప్రాంతంగా ఉంది. తమిళనాడులోని కృష్ణగిరి అటవీ ప్రాంతం నుంచి పేర్నంబట్టు, గుడియాత్తం, మోర్దాన్ డ్యామ్ నుంచి పలమనేరు, మొగిలి, కౌండిన్య అటవీ ప్రాంతం వరకు ఉన్న అడవి, ఏనుగుల సంచారానికి వీలుగా ఉంది. రామకుప్పం, కాలువపల్లె, టేకుమంద, రాగిమానుపెంట, బోడబండ్ల ఫారెస్టు బీట్ పరిధిలో ఏనుగులు సంచారం ఎక్కువగా ఉంది. రాష్ట్ర సరిహద్దులోని మోర్దాన్ డ్యామ్, మొగిలి గొనిచెరువు నీటి నిల్వలు ఉంటాయి. ఏనుగులకు నీరుతో పాటు ఆహారం అవసరం, ఈ అటవీ సరిహద్దు గ్రామాల్లో పంటపొలాలు కూడా ఉన్నాయి. రాత్రి వేళల్లో ఏనుగుల గుంపు పంటలపై పడి ధ్వంసం చేస్తున్నాయి. రైతులకు అపార నష్టాన్ని కలిగిస్తున్నాయి.



ఏడాది క్రితం మొగిలివెంకటగిరి గ్రామంలోకి ప్రవేశించిన ఏనుగులు (ఫైల్)

నామమాత్రంగా నష్టపరిహారం

ఏనుగులు నష్టపరిచిన రైతుల పంటలకు ప్రభుత్వం నామమాత్రంగానే పరిహారం చెల్లిస్తోంది. ఎకరా వరి సాగుకు అన్ని ఖర్చులు కలుపుకుని రూ.30 వేల వరకు అవుతుండగా పరిహారం కింద కేవలం రూ.6 వేలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోంది. 2011లో ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారాన్నే నేటికీ ప్రభుత్వం చెల్లిస్తుంది. మామిడి, కొబ్బరి చెట్టుకు రూ.వెయ్యి, అరటికి రూ.300 చొప్పున పరిహారం చెల్లిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పరిహారం రైతులకు సరిపోవడంలేదు. ఏనుగుల దాడుల నుంచి తమ పంటలను కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు.



వెలుతురుచేనులో చెరుకు తోటను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

నష్టపరిహారం పెంచాలి



రూ.లక్షలు ఖర్చు చేసి పంటలు సాగు చేసుకుంటున్నాం. సాగుకు అప్పులు కూడా చేస్తున్నాం. కష్టపడి పండించుకున్న పంటలపై ఏనుగులు దాడులు చేసి, తీవ్రంగా నష్ట పరుస్తున్నాయి. ఏనుగుల దాడిలో నష్టపోయిన పంటలకు అధికారులు అందిస్తున్న పరిహారం ఏమాత్రం చాలడం లేదు. రైతుల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం పరిహారం పెంచి ఇవ్వాలి.

- కోదండయాదవ్, రైతు, పాన్నెపాళెం

కందకాలు తవ్వాలి



ఏనుగులు సంచరిస్తున్న అటవీ ప్రాంతంలో పూర్తిగా కందకాలు(ట్రెంచ్‌లు) తవ్వకాలు చేపడితే కొంతవరకు ఏనుగుల దాడులను ఆరికట్టవచ్చు. గతంలో ఏనుగు దాడుల నివారణకు అటవీ సరిహద్దుల్లో అటవీశాఖ సోలార్ కంచె ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల సోలార్ కంచె ధ్వంసం కావడంతో ఏనుగులు ఆ మార్గంలో పంటపొలాల వైపు వస్తూ రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. కందకాలతో రక్షణ చర్యలు చేపడితే రైతులకు మేలు జరుగుతుంది.

- రాజా సర్పంచ్, కీరమంద

తరలింపునకు చర్యలు తీసుకుంటున్నాం



ఏనుగులు పంట పొలాలపైకి రాకుండా అడవుల్లోకి మళ్లించే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. సిబ్బందితో పాటు ట్రాకర్లు కృషి చేస్తున్నారు. ఓ వైపు నుంచి వచ్చిన ఏనుగులను మరొక్క వైపు మళ్లిస్తున్నప్పటికీ, తిరిగి పంట పొలాలపైకి వస్తున్నాయి. ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులు అందించిన వినతుల మేరకు పంటనష్ట పరిహారం చెల్లించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నాం. మంజూరైన పరిహారాన్ని బాధిత రైతులకు అందిస్తున్నాం.

- నారాయణ, ఎఫ్ఆర్ఓ, పలమనేరు

వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయకపోతే జీతాలు కోత



మాట్లాడుతున్న సీజీఎం ధర్మజ్ఞాని, పక్కన ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్

●ట్రాన్స్‌కో సీజీఎం ధర్మజ్ఞాని

చిత్తూరు కార్పొరేషన్: వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయని ఏఈల జీతాలు కట్ చేస్తామని ట్రాన్స్‌కో సీజీఎం ధర్మజ్ఞాని, ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ హెచ్చరించారు. శుక్రవారం అర్బన్, రూరల్ ఈఈ కార్యాలయాల్లో వేర్వేరుగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డివిజన్ పరిధిలో క్వారేటినగరం, ఎస్ఆర్ పురం, పైపల్లె, రెడ్డిగుంట, పూతలపట్టు, యాదమరి ఏఈలు పెండింగ్ వర్క్ ఆర్డర్లను ఇంకా క్లోజ్ చేయలేదన్నారు. వారంలోపు వీటిని క్లోజ్ చేయకపోతే జీతాల నుంచి రికవరీ పెడతామన్నారు. ఈ నెల నుంచి విద్యుత్ బిల్లు కింద క్యూఆర్ కోడ్ ముద్రించి ఇస్తున్నామన్నారు. వాటి ద్వారా బిల్లులు చెల్లించేలా వినియోగదారులను ప్రోత్సాహించాలన్నారు. తద్వారా ఆన్‌లైన్ పేమేంట్స్ పెరుగుతాయన్నారు. నూతన సర్వీసులను సకాలంలో విడుదల చేయాలన్నారు. రూరల్ డివిజన్ నుంచి అర్బన్ డివిజన్‌కు పూతలపట్టు సెక్షన్ త్వరలో విలీనం అవుతుందన్నారు. రెడ్డిగుంటకు రూరల్-3 సబ్‌డివిజన్ కార్యాలయం మారుతుందన్నారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, జగదీష్, ఏఓ ప్రసన్న ఆంజనేయులు, డీఈలు ప్రసాద్, ఆనంద్, శేషాద్రిరెడ్డి, కొండయ్య, ఏఈ, సబ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యానికి ధోకా లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ప్రభాకర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పశువైద్యానికి ధోకా లేకుండా చూడాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆ శాఖ అధికారులు, వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు జరుగుతాయన్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి రెండు టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. వారు మండలాల వారీగా క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ శిబిరాల్లో పశువులకు పిడుదుల నివారణకు మందులు పిచికారి చేయించాలన్నారు. మేకలు, ఆవులు, గొర్రెలు, దూడలకు పురుగు మందులు తాగించాలన్నారు. చూలు నిల్వకు చికిత్స అందించాలన్నారు. గోకులం షెడ్‌లను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. పశుగ్రాసం పెంపకం లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని చెప్పారు. డీడీలు హరీష్, గోవిందయ్య, శ్రీలక్ష్మి, వాసు, ఏడీలు, పశువైద్యులు పాల్గొన్నారు.

రుణ పంపిణీకి సహకరించండి

- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బీసీ, ఎస్సీ కార్పొరేషన్లు అమలు చేసే రుణాలను వంద శాతం అమలు చేసేందుకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులు, బ్యాంకర్లతో స్పెషల్ డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ వర్గాల జీవనోపాధులు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోందన్నారు. రుణాల మంజూరులో ఆయా శాఖల అధికారులు వంద శాతం లక్ష్యాలు తప్పనిసరిగా చేరుకోవాలన్నారు. బీసీ, ఎస్సీ, ఈబీసీ, రెడ్డి, కమ్మ, కాపు, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో అర్హులకు సబ్సిడీ రుణాలు ఇస్తున్నారన్నారు. ఈ రుణాల మంజూరులో అర్హతలను పూర్తిగా పరిశీలించాలన్నారు. ఎంఎస్ఎంఈలో ప్రతి యూనిట్‌లో 3 నుంచి ఐదుగురు సభ్యులు ఉండేలా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి అర్హులను గుర్తించి రుణాలు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వ సబ్సిడీని 3 శ్లాబ్‌లుగా విభజించి రాయితీ అందిస్తుందన్నారు. స్వయం ఉపాధి రుణాలకు బీసీ, ఎస్సీ లకు వ్యవసాయం, పశు పోషణ, మోటార్ వాహనాల విభాగం, పరిశ్రమల స్థాపన, వ్యాపారం, ఇతర సేవలకు రుణాల మంజూరు చేస్తామన్నారు. రుణాల మంజూరులో బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో బీసీ కార్పొరేషన్ తో పాటు ఇతర కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో 2800 యూనిట్‌లు, ఎస్సీ కార్పొరేషన్ లో 678 యూనిట్ల మంజూరు కు లక్ష్యం విధించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, ఎల్‌డీఎం హరీష్, జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఎల్‌డీవో రవికుమార్, వివిధ బ్యాంక్‌ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



వెంకటరమణారెడ్డిని దుశ్శాలువతో సత్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

ఏపీసీ సేవలు అభినందనీయం

చిత్తూరు కలెక్టరేట్ : సమగ్రశిక్ష శాఖ ఏపీసీగా పనిచేసిన వెంకటరమణారెడ్డి సేవలు అభినందనీయమని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అభినందించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వెంకటరమణారెడ్డికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమగ్రశిక్ష శాఖ ఆశయాలను నెరవేర్చేందుకు వెంకటరమణారెడ్డి కృషి చేశారన్నారు. సమగ్రశిక్ష శాఖ పరిధిలో పథకాలను వంద శాతం అమలయ్యేలా చర్యలు చేపట్టారన్నారు. అనంతరం పూర్వ ఏపీసీని దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నూతన ఏపీసీ వెంకటరమణ, సమగ్రశిక్ష శాఖ సెక్టోరల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల మృతి కేసులో తల్లి అరెస్టు



నిందితురాలు అరెస్టు చూపుతున్న పోలీసులు

సదుం: ఇద్దరు చిన్నారుల మృతికి కారకురాలైన తల్లిని అరెస్టు చేసినట్లు సీఐ రాంభూపాల్, ఎస్ఐ షేక్ షావలి తెలిపారు. వారి కథనం మేరకు.. మండల కేంద్రంలోని మసీదు వీధికి చెందిన కరిష్మా ఈనెల 12న తన ఇద్దరు చిన్నారులు సిద్ధ, జరా ఫాతిమాను కరెంటు వైరుతో ఉరివేసి, తాను ఆత్మహత్యకు ప్రయత్నించింది. గుర్తించిన కుటుంబసభ్యులు వారిని ఆస్పత్రికి తరలించగా ఇద్దరు చిన్నారులు మృతిచెందగా.. తల్లికి ప్రాణాపాయం తప్పింది. ఈ కేసుకు సంబంధించి కరిష్మా బస్టాండ్‌లో ఉండగా శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు కార్పొరేషన్: పూతలపట్టు మండలం వావిల్‌తోట వద్ద రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు.. సదుం మండలం చింతలవారి పల్లెకు చెందిన దేవేంద్రరెడ్డి (51) వావిల్‌తోట సమీపంలో ద్విచక్రవాహనం పెట్టాడు. అనంతరం సమీపంలో రైలు పట్టాల పైకి వెళ్లి నిల్చున్నాడు. అటువైపుగా వస్తున్న విల్లుపురం-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు కూత పెడుతున్నా పక్కకు తప్పుకోకుండా అక్కడే ఉండంతో రైలు అతడిని ఢీ కొంది. దీంతో అతడు అక్కడికక్కడే మరణించారు. సంఘటనపై లోకో పైలెట్ సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశామన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని భావిస్తున్నమని రైల్వే ఎస్ఐ తెలిపారు.

గుల్లేపల్లి వద్ద మరొకరు..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కుప్పంరూరల్: గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బెంగళూరు - చెన్నై రైల్వే మార్గంలోని కుప్పం మండలం గుల్లేపల్లి వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి ఎర్రటి షర్టు, తెల్లటి బనియన్, మెడలో రుద్రాక్ష మాల ధరించిన వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం రైలు పట్టాలపై ఈ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వేపోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎవరైనా ఆనవాళ్లు గుర్తిస్తే శవాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు రైల్వే పోలీసులు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

కాణిపాకం: స్వయంభు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణరథంపై స్వామి విహారం

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి శుక్రవారం రాత్రి స్వర్ణ రథంపై కొలువై ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తికి అలంకార మండపంలో విశేష అభిషేకాలు చేసి అలంకరించారు. అనంతరం స్వర్ణ రథంపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారు ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కర్పూర మంగళహారతులు సమర్పించారు.



బంగారు రథంలో ఊరేగుతున్న వరసిద్ధుడు



సంకటహర చతుర్థి వ్రతంలో పాల్గొన్న భక్తులు



వరసిద్ధి వినాయకస్వామి ఆలయ క్యూలో వేచి ఉన్న భక్తులు